వైభవంగా సుదర్శన నారసింహ హోమం

నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 1 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారికి కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల వెండి మొక్కు జోడు సేవోత్సవం వైభవంగా సాగింది. స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి తిరు మాఢవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు సాగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకుపూజ జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 4వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖాజానకు రూ.8,51,829 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

గ్రామాల్లో రోజూ మంచినీరు సరఫరా చేయాలి

• ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి వై.కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి కృష్ణయ్య

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 1 : గ్రామాల్లో అంతరాయం లేకుండా రోజూ ప్రజలందరికీ మంచినీటి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి వై.కృష్ణయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మంచినీటి సహాయకుల 4రోజుల శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో చేతి పంపులతోపాటు పైపులైన్ల మరమ్మతులు చేయాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ వేయడంతోపాటు ప్రతి ఇంటికీ నీటి సరఫరా అయ్యేలా పరిశీలించాలని సూచించారు. డీపీఓ సునంద, ఎంపీడీఓ రాములునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అరుణ, ఇన్‌చార్జి ఏఈ సుప్రియ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

• అదనపు జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ మనోహర్

సమావేశంలో మాట్లాడుతున్న ఏడీపీహెచ్‌ఓ డాక్టర్ మనోహర్

చౌటుప్పల్, అక్టోబర్ 1 : అన్ని రకాల వైద్య సేవలు అందించి జిల్లాను మొదటి స్థానంలో నిలుపాలని, ఇందు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ (ఏడీపీహెచ్‌ఓ) డాక్టర్ మనోహర్ అన్నారు. తంగడపల్లి పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ కాన్పులు పెంచాలని, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సరైన సమయంలో ఇవ్వాలని అన్నారు. టీబీ లెప్రసీ వ్యాధుల గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అసంక్రమిత వ్యాధుల పరీక్షలు నిర్వహించి మందులు సరిగా అందించాలన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని బాలింతలకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుమన్ కళ్యాణ్, సంపత్, కాటంరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విలక్షణమైన సంస్కృతి తెలంగాణ సొంతం

• రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి

నలంద డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి

చౌటుప్పల్, అక్టోబర్ 1 : విలక్షణమైన ప్రత్యేక సంస్కృతి తెలంగాణ సొంతం అని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి అన్నారు. పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో పూలను, ప్రకృతిని పూజించే సంప్రదాయం తెలంగాణకు మాత్రమే ఉందన్నారు. నేటి తరం వాళ్లు ఆ సంస్కృతిని కొనసాగిస్తూ వచ్చే తరానికి అందించాలని, ఆ బాధ్యత విద్యార్థులపైనే ఉందని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ వల్లమల్ల రాజశేఖర్, ప్రిన్సిపాల్ పోలు విష్ణుకుమార్, డైరెక్టర్లు వాలుగొండ శ్రీనివాస్, మల్లేశం, దుర్గయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ లింగస్వామి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

• జడ్పీ సీఈఓ శోభారాణి

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

తుర్కపల్లి, అక్టోబర్ 1 : ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్లాస్టిక్ వాడకం ద్వారా ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతారన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. అనంతరం రాంపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, వసతులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీడీఓ రూన్సీలక్ష్మీబాయి, పంచాయతీ కార్యదర్శి శైలజ, ఉపాధ్యాయులు ఉన్నారు.

అక్రమ కట్టడాన్ని తొలగించాలని వినతి


మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న తంగడపల్లి గ్రామస్తులు

చౌటుప్పల్, అక్టోబర్ 1 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి బ్రహ్మంగారి గుడి ప్రహరీ పక్కన నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తొలగించాలని మున్సిపల్ కార్యాలయంలో గ్రామస్తులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ నిర్మాణంతో రహదారి ఇరుకుగా మారుతుందని పేర్కొన్నారు. తక్షణమే దానిని తొలగించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గోవిందాచారి, ఎం.శ్రీనివాసాచారి, ఆర్.కృపాచారి, పరిపూర్ణచారి, మాధవాచారి, గిరి చారి, ఆనంతాచారి, వెంకటాచారి, ఓంకారాచారి ఉన్నారు.

చట్టాలతో వయోవృద్ధులకు న్యాయం

• కలెక్టర్ హనుమంతు కె.జెండగే

వృద్ధులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి అర్బన్, అక్టోబర్ 1 : వయోవృద్ధుల సంక్షేమం కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై వారికి అవగాహన కల్పిస్తే న్యాయం జరుగుతుందని కలెక్టర్ హనుమంతు కే జెండగే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రుల చూసుకునే బాధ్యత పిల్లలపై ఉందని, కన్నవారికి పిల్లలు ప్రేమ, ఆప్యాయతలను పంచాలని అన్నారు. పిల్లలు తల్లిదండ్రుల పోషణను చూడకపోతే మెయింటెనెన్స్ ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. సీనియర్ సిటిజన్ సంరక్షణ చట్టం ప్రకారం పిల్లలు తల్లిదండ్రుల బాధ్యతను విధిగా తీసుకోవాలన్నారు.

అనంతరం సీనియర్ సిటిజన్ అసోషియేషన్ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహరావు. యాదగిరిగుట్ట ఏసీపీ రమేశ్, డీఎంహెచ్‌ఓ యశోద, భువనగిరి ఆర్డీఓ అమరేందర్. చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు బాలేశ్వర్, పోలి శంకర్ రెడ్డి. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కే మోహన్ రెడ్డి, బాలరాజు. సూపరింటెండెంట్ శశికళ, సీడీపీఓలు స్వరాజ్యం, శైలజ, జ్యోత్స్న, రమ, సమీరా మీర్జా పాల్గొన్నారు.

3న భూ నిర్వాసితుల ధర్నా

చౌటుప్పల్, అక్టోబర్ 1 : హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ఈ నెల 3న నిర్వహిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల ధర్నాను విజయవంతం చేయాలని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, అఖిలపక్ష నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్నాకు భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లోని వివిధ గ్రామాల రైతులు రానున్నట్లు వారు తెలిపారు. ఉదయం 10గంటలకు ధర్నా చౌక్ చేరుకోవాలని సూచించారు. ధర్నాకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరు కానున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 1 : మండలంలోని లింగోజిగూడెం గ్రామానికి చెందిన ఓ వివాహిత గత నెల 29న అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పాతకాసారం గ్రామానికి చెందిన పారబోయిన మురళితో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన కాసాని చాందినికి అగస్టులో వివాహం జరిగింది. వారు చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం గ్రామంలో చాందిని అమ్మమ్మ గోపమ్మతో కలిసి ఉంటున్నారు. మురళి స్థానిక దివీస్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. మురళి సెప్టెంబర్ 29న రాత్రి డ్యూటీకి వెళ్లి మరుసటి రోజు ఇంటికి వచ్చిచూడగా చాందిని కనిపించలేదు. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటం, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె బంధువు కాసాని వీరబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

• మున్సిపల్ చైర్మన్ రాజు


స్వచ్ఛ కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, అక్టోబర్ 1 : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల అవరణంలో పిచ్చిమొక్కలను తొలగించి చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. మానవహారం నిర్వహించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కృషితో త్వరలోనే పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్ పరిశీలన

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 1 : మండల కేంద్రంలోని వీర్ల చెరువు వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్‌ను ఎంపీడీఓ రాములునాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ బతుకమ్మ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్ ఉన్నారు.

పారాచూటర్ హర్షితకు కలెక్టర్ అభినందన

హర్షితను అభినందిస్తున్న కలెక్టర్ జెండగే

బీబీనగర్, అక్టోబర్ 1 : మండలంలోని రాఘవాపురం గ్రామంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక మహిళా కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ దేవళ్ల హర్షిత ఆర్మీ ఎయిర్ బార్న్ ట్రైనింగ్ స్టేషన్ ఆగ్రాలో నిర్వహించిన పారాబేసిక్ కోర్సును పూర్తి చేసి రెండు పారాచూట్ జంపింగ్‌లను విజయవంతంగా పూర్తి చేసింది. హర్షితను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హనుమంతు కె.జెండగే అభినందించారు. ప్రశంసా పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల కళాశాలలో చదువుతూ ఎన్‌సీసీ క్యాడెట్‌గా మంచి గ్రేడ్‌ను సాధించడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.నిరూప మాట్లాడుతూ పారాబేసిక్ కోర్సు సాహసోపేతమైనదని, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నిపుణులతో ఈ కోర్సును నిర్వహిస్తారని అన్నారు. దేశ వ్యాప్తంగా 20మంది బాలురు, 20 మంది మహిళా క్యాడెట్‌లు, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి ముగ్గురు క్యాడెట్లు పాల్గొన్నారని తెలిపారు. కోర్సులో భాగంగా ఐఏఎఫ్ ఏఎన్ – 32 విమానం నుంచి 1500 అడుగుల ఎత్తు నుంచి పారాచూట్ ద్వారా నేల మీదికి చేరుకుంటారన్నారు. హర్షిత రెండు సార్లు జంప్‌ను విజయవంతంగా పూర్తి చేసి పారాబేసిక్ కోర్సులో మంచి గ్రేడ్‌ను సాధించిందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.రూప పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

• బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాందేవ్

సమావేశంలో మాట్లాడుతున్న రాందేవ్

భువనగిరి అర్బన్, అక్టోబర్ 1 : కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రాందేవ్ అన్నారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీ ప్రకారం కులగణన చేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ఎలాంటి చిక్కులు లేవని పేర్కొన్నారు. బీహార్‌లో 69, తమిళనాడులో 70 శాతం బీసీ రిజర్వేషన్లు అమలవుతుంటే ఇక్కడ ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకోవాలని చూడడం తగదని, రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్తే బీసీలు తగిన బుద్ధి చెబుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కులగణన జరిగిన తర్వాతే ఎన్నికలకు పోవాలని, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ధర్నాలు తప్పవన్నారు. సమావేశంలో సామాజికవేత్త బట్టు రాంచంద్రయ్య, బీసీ సంఘం నాయకులు సురేశ్, మధు, సాగర్, ఎల్లేశ్, యశ్వంత్, అఖిల్, మల్లికార్జున్, నాగరాజు పాల్గొన్నారు.

కాలుష్య పరిశ్రమకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి : డీవైఎఫ్ఐ

అదానీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

రామన్నపేట, అక్టోబర్ 1 : రామన్నపేట – కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో నెలకొల్పనున్న అదానీ అంబుజా సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కేజీ భవన్‌లో మంగళవారం జరిగిన డీవైఎఫ్ఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. భవిష్యత్ తరాలకు పర్యావరణాన్ని, పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే సిమెంట్ కాలుష్య పరిశ్రమను నెలకొల్పాలనే ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఈ నెల 23న జరిగే ప్రజాభిప్రాయ సేకరణను యువత అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సుభాశ్ సెంటర్‌లో అదానీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహాసభలో సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శానగొండ రామచంద్రం, కార్యదర్శిగా మెట్టు శ్రవణ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగటి ఉపేందర్, నాయకులు అవనగంటి హరీశ్, సైదులు, లెనిన్, ప్రసాద్ పాల్గొన్నారు.

సీపీఎం ఆత్మకూరు(ఎం) పట్టణ కార్యదర్శిగా సత్తయ్య

ఆత్మకూతరు(ఎం), అక్టోబర్ 1 : సీపీఎం ఆత్మకూరు(ఎం) పట్టణ కార్యదర్శిగా రాచమల్ల సత్తయ్య ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన గ్రామ కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శిగా కందాడి వెంకట్‌రెడ్డి, సభ్యులుగా రచ్చ భిక్షపతి, రాగటి ఆదినారాయణ, రచ్చ రమేశ్ ఎన్నికయ్యారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, జిల్లా నాయకులు రచ్చ గోవర్ధన్, చెరుకు మల్లేశం, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు

నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్ : తెలంగాణలో అతి పెద్ద పండుగ బతుకమ్మను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పాఠశాల ఆవరణలో ఉంచి ఉపాధ్యాయులతో కలిసి ఆడిపాడారు. అలేరులోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో విద్యార్థినులు బతుకమ్మలను అలంకరించి కోలాటం ఆడారు. భువనగిరి పట్టణంలోని పలు స్కూళ్లు, కాలేజీల్లో బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం రావణ దహనం చేశారు. చౌటుప్పల్ పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ట్రినిటి విద్యాసంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.

బీబీనగర్ : లిటిల్ బడ్స్ హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

భూదాన్ పోచంపల్లి : కృష్ణవేణి హైస్కూల్లో ..

చౌటుప్పల్ : ట్రినిటి పాఠశాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

భువనగిరి అర్బన్ : నవభారత్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

ఆలేరు టౌన్ : ఎస్ఆర్‌కేవీ విద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దు

• డీఎల్పీఓ శ్రీకాంత్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీఓ శ్రీకాంత్‌రెడ్డి

మోత్కూరు, అక్టోబర్ 1 : గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా, మంచినీటి సరఫరాలో ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్పీఓ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల పరిధిలోని పంచాయతీ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తాగునీటి పైపులైన్ లీకేజీ లేకుండా చూసుకోవాలని సూచించారు. పండుగల సీజన్ కావడంతో గ్రామాల్లో మురుగు కాల్వలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ఎండీ నిరంజన్ వలీ, శంకరయ్య, ఎంపీఓలు, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

• జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ

మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ

వలిగొండ, అక్టోబర్ 1 : శిశువులందరికీ షెడ్యూల్ ప్రకారం విధిగా టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ అన్నారు. మండలంలోని వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం డాక్టర్లు సూచించిన షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించేలా చూడాలని ఆశ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రదీప్, జ్యోతి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుంది : ఏడీఏ

పత్తి పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్‌రావు

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 1 : అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, మాఫీ కాని వారు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో జరుగుతున్న రుణమాఫీ సర్వేను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని పుట్టపాక గ్రామంలో పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ పావని, ఏఈఓలు సైదులు, శివకుమార్, అనూరాధ, స్వప్నిక, సోమప్ప పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలరాజు

ఆలేరు రూరల్, అక్టోబర్ 1 : ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాటూరి బాలరాజు అన్నారు. మండలంలోని శర్భనాపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేశ్, నాయకులు సత్యరాజయ్య, రాజు, ఎర్రయ్య, నర్సయ్య, నరేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు బహూకరణ

విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న మాజీ సర్పంచులు జంగయ్యయాదవ్, పద్మాకృష్ణగౌడ్

భువనగిరి అర్బన్, అక్టోబర్ 1 : మండలంలోని బండసోమారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలోని గౌస్‌నగర్ గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు కాలినడకన వస్తుండడం చూసి మాజీ సర్పంచులు కాటిక జంగయ్య యాదవ్, నానం పద్మాకృష్ణగౌడ్ చలించారు. వారికి మంగళవారం సైకిళ్లను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌస్‌నగర్ నుంచి చందుపట్ల పాఠశాలకు నడిచి రావడంతో విద్యార్థులు అలిసిపోతారన్నారు. ఇబ్బందులకు గురై విద్యను మధ్యలోనే నిలిపివేయవద్దని వారిని ప్రోత్సహించడం కోసం సైకిళ్లను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. గౌస్‌నగర్ నుంచి చందుపట్ల పాఠశాలకు ఎంత మంది విద్యార్థులు వచ్చినా సైకిళ్లను అందజేస్తామని చెప్పారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి : సీపీఎం

మోత్కూరు, అక్టోబర్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్